జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 9 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 8



## వినాయక చవితికి పటిష్ట బందోబస్తు




- మణుగూరు డివిజన్ లో శాంతి కమిటీ భేటీ...
- ఎలాంటి వివదాలకు,ఘటనలకు తావు లేదు...
- ప్రశాంతంగా వేడుకలు జరపాలని సూచన...
- శాంతి కమిటీ భేటీలో రాజకీయ,ప్రజా ప్రతినిధులకు దిశానిర్దేశం...
- మణుగూరు సబ్ డివిజన్ డీఎస్పీ రవీందర్ రెడ్డి..

2 లో...



# భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 8,(ప్రజా జ్యోతి)** పాల్వంచ మండలంలోని బోజ్యా తండా పరిధిలో చేపడుతున్న భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బోజ్యా తండా పరిధిలోని సర్వే నంబర్ 77లో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రీ-సర్వేలో భాగంగా సర్వే అధికారులు రోవర్ పరికరాల సహాయంతో భూములను కొలుస్తున్న విధానాన్ని, భూముల హద్దులను గుర్తిస్తున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న సర్వే ద్వారా భూముల వాస్తవ విస్తీర్ణం,హద్దులు,స్థానాన్ని గుర్తించి, సంబంధిత భూ రికార్డులతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బోజ్యా తండా పరిధిలో మొత్తం 458 ఎకరాల్లో భూముల రీ-సర్వే చేపట్టాల్సి ఉండగా, ప్రస్తుతం సర్వే నంబర్ 77లో 88 ఎకరాల్లో రీ-సర్వే పనులు కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు చేపట్టిన సర్వే పురోగతి, మిగిలిన భూముల్లో చేపట్టాల్సిన పనులు, సర్వేకు అవసరమైన సిబ్బంది, పరికరాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భూముల రీ-సర్వేలో భాగంగా ప్రతి భూ యజమానికి సంబంధించిన భూమి హద్దులను పరిశీలించి, అందుబాటులో ఉన్న భూ రికార్డులతో సరిపోల్చాలని, భూరీ-సర్వే పనులను మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి రీ-సర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతుల భూపత్రాలను పరిశీలించారు. తమ భూములకు సంబంధించిన పట్టాదారు

మిగతా 2 లో...



# కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయానికి రెక్కలు

- ఒకవైపు విమానాశ్రయం స్థల ఏర్పాటుకు అధ్యయనం చేస్తుండగానే
- మరోవైపు మంత్రి తుమ్మల ఏవియేషన్ అధికారులతో చర్చలు
- వారం రోజుల్లో ఎయిర్ పోర్ట్ పై నివేదిక ఇస్తామన్న అధికారులు
- జిల్లా ప్రజల ఆశలపై చివరింపజేస్తున్న మంత్రి తుమ్మల

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 8 ,(ప్రజా జ్యోతి)** కొత్తగూడెం జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన విమానాశ్రయ ఏర్పాటుపై కదలికలు వేగం పుంజుకున్నాయి. విమానాశ్రయానికి అనువైన స్థలాన్ని గుర్తించేందుకు హైదరాబాద్, ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక ఏవీఎస్ అధికారులు, సాంకేతిక నిపుణుల బృందాలు మంగళవారం

మిగతా 2 లో...

## భద్రాచలం ఎమ్మెల్యే పీఏ అరెస్ట్...

- ఉద్యోగాల పేరుతో రూ.8 కోట్ల టోకరా..!
- 54 మంది నిరుద్యోగులకు కుచ్చుటోపీ...
- బెట్టింగ్ కు బలైన రూ.8 కోట్లు పోగొట్టుకున్న వైనం...
- రాయల శ్రీను ఫిర్యాదుతో పీఏ కళ్యాణ్ అరెస్ట్...




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. /సెప్టెంబర్ 08,(ప్రజాజ్యోతి)** ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి మోసం చేసిన కేసులో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ పీఏ కళ్యాణ్ ను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. భద్రాచలం వాసి రాయల శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. 54 మంది నిరుద్యోగుల నుంచి సుమారు రూ.8 కోట్లు వసూలు చేసి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణలో కళ్యాణ్ కు బెట్టింగ్ అలవాటు ఉందని,ఆ బెట్టింగ్ లోనే భారీగా డబ్బు పోగొట్టుకున్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిపారు.ఈ వ్యవహారంపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తునట్లు తెలుస్తోంది.

## కొత్తగూడెం కలెక్టరేట్ పేరుతో

# రేషన్ దందా...

- నకిలీ ఐడీతో బండి మధు వసూళ్లు..!
- కలెక్టరేట్ జూనియర్ అసిస్టెంట్ నంటూ బురిడీ...
- రేషన్ కార్డుల పేరుతో అమాయకులకు టోకరా...
- రేషన్ కార్డులొస్తాయని నమ్మించి లక్షల వసూలు..?
- కలెక్టర్ నిఘా పెట్టాలని బాధితుల డిమాండ్...
- బండి మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని భాధితులు వినతి...

2 లో..



## కొత్తగూడెం కలెక్టరేట్ పేరుతో రేషన్ దందా...

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. /సెప్టెంబర్ 08, ప్రజాజ్యోతి**
కలెక్టరేట్ పేరు చెప్పుకుని రేషన్ కార్డుల పేరుతో భారీ మోసానికి పాల్పడిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కలకలం రేపుతోంది.తాను కలెక్టరేట్ లో జూనియర్ అసిస్టెంట్ నంటూ బండి మధు అనే వ్యక్తి నకిలీ ఐడీ కార్డు చూపించి అమాయక ప్రజల నుంచి రేషన్ కార్డులు ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేశాడని బాధితులు కొంతమంది ఆరోపిస్తున్నారు.కార్డుల కోసం ఎదురుచూసిన బాధితులు ఆరా తీయగా అతను చూపించిన ఐడీ కార్డు నకిలీదని తేలడంతో మోసపోయామని భాధితులు గ్రహించారు. నెలలు గడుస్తున్నా రేషన్ కార్డులు రాకపోవడం, డబ్బులు అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. తమ నుంచి వసూలు చేసిన డబ్బులను తిరిగి ఇప్పించాలని, మోసానికి పాల్పడిన బండి మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. కలెక్టరేట్ లాంటి అత్యున్నత కార్యాలయం పేరుతో ఇలాంటి దందా జరగడం ప్రభుత్వ వ్యవస్థపైనే ప్రజలకు నమ్మకం సడలేలా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంటనే ఈ వ్యవహారంపై నిఘా పెట్టి విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు. నకిలీ ఐడీతో ఉద్యోగి పేరు చెప్పుకుని వసూళ్లకు పాల్పడుతున్న బండి మధుపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేయాలి



(మొదటి పేజీ తరువాయి...)
పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర అందుబాటులో ఉన్న భూ రికార్డులను సర్వే అధికారులకు అందజేయడంతో పాటు, తమ భూముల వాస్తవ హద్దులను చూపించి సర్వే ప్రక్రియకు సహకరించాలని రైతులకు సూచించారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధార ప్రసాద్, సర్వేయర్లు వెంకన్న, కళ్యాణ్, లైసెన్స్డ్ సర్వేయర్లు మధు, వంశీ, కవిత, జీపీఓ రాధా, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలి

- **ఏఐవైఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గరికె శ్రీనివాస్**



**ములకలపల్లి సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి):** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐవైఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గరికె శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సుమారు 280 ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో కూడిన రెండు జేఏసీలు కలిసి లక్ష మంది ఉద్యోగులతో కార్యక్రమాన్ని తలపెట్టడం అభినందనీయమన్నారు. పీఆర్సీ, 6 డీఏలు మంజూరు చేయడం, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయడం, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం, పెండింగ్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించడం తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐవైఈఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలని కోరారు.

# కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయానికి రెక్కలు

(మొదటి పేజీ తరువాయి...)
జిల్లాలో పరిశీలన చేపట్టాయి. ఇప్పటికే గుర్తించిన ప్రాంతాలతోపాటు కొత్తగా మణుగూరు ప్రాంతాన్ని కూడా బృందం పరిశీలించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయా ప్రాంతాల్లో రన్ వే నిర్మాణానికి అనువైన భూభాగం, భౌగోళిక పరిస్థితులు, వాతావరణం, భూసేకరణ తదితర అంశాలను అధికారులు పరిశీలించారు.

**కేంద్ర మంత్రి ఏవియేషన్ అధికారులతో తుమ్మల చర్చలు**

కొత్తగూడెం విమానాశ్రయ ఏర్పాటుపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఏవియేషన్ అధికారులతో సమావేశమై చర్చించారు. జిల్లాలో విమానాశ్రయం అవసరం, ప్రజల చిరకాల ఆకాంక్ష, భద్రాచలం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు, పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధికి విమానాశ్రయం కలిగించే ప్రయోజనాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సాంకేతిక బృందం పరిశీలన అనంతరం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు.

**మిగతా స్థలాలతో పాటు మణుగూరు కూడా పరిశీలన**

విమానాశ్రయ ఏర్పాటుకు గతంలో గుర్తించిన ప్రాంతాలతోపాటు తాజాగా మణుగూరు ప్రాంతాన్ని కూడా ప్రత్యేక సాంకేతిక బృందం పరిశీలించింది. ఢిల్లీ నుంచి వచ్చిన ఏవీఎస్ అధికారులు, సాంకేతిక నిపుణులు మణుగూరు పరిసరాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి విమానాశ్రయ నిర్మాణానికి ఉన్న అనుకూలతలను అధ్యయనం చేశారు. రన్ వే నిర్మాణానికి అవసరమైన భూభాగం, భౌగోళిక పరిస్థితులు, పరిసర ప్రాంతాల స్వభావం, విమానాల రాకపోకలకు ఉన్న అవకాశాలు, భూసేకరణ తదితర అంశాలను పరిశీలించారు.

ఇప్పటికే గుర్తించిన ఇతర ప్రాంతాలతో మణుగూరు ప్రాంతాన్ని కూడా సాంకేతికంగా పోల్చి చూడనున్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని విమానాశ్రయ ఏర్పాటుకు అత్యంత అనుకూలమైన ప్రాంతాన్ని గుర్తించనున్నారు. అనుకూలత ఉంటే ముందుకు సాంకేతికంగా అనుకూలంగా ఉన్న ప్రాంతాన్ని గుర్తించి, విమానాశ్రయ ఏర్పాటుకు తగిన చర్యలు వేగంగా చేపట్టాలని మంత్రి తుమ్మల అధికారులను కోరారు. పరిశీలన పూర్తయిన అనంతరం వారం నుంచి పది రోజుల్లో సమగ్ర నివేదికను సమర్పిస్తామని అధికారులు తెలిపారు. నివేదికలోని సాంకేతిక అంశాల ఆధారంగా తదుపరి ప్రక్రియను వేగవంతం చేసే అవకాశం ఉంది.

**దశాబ్దాల కలకు కొత్త ఆశలు**

గతంలో గుర్తించిన కొన్ని ప్రాంతాలు సాంకేతిక కారణాలతో అనుకూలం కాకపోవడంతో విమానాశ్రయ ప్రతిపాదనకు ఆటంకాలు ఎదురయ్యాయి. తాజాగా ప్రత్యామ్నాయ ప్రాంతాల అన్వేషణ, ప్రత్యేక సాంకేతిక బృందాల క్షేత్రస్థాయి పరిశీలనతో ప్రాజెక్టుపై మళ్లీ ఆశలు చిగురించాయి. బృందం నివేదిక సానుకూలంగా వస్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయ నిర్మాణానికి తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉంది. విమానాశ్రయం ఏర్పాటైతే భద్రాచలం పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులతోపాటు జిల్లా పారిశ్రామిక, పర్యాటక రంగాలకు మరింత ఊతం లభించనుంది.

## వినాయక చవితికి పటిష్ట బందోబస్తు...

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. /మణుగూరు సెప్టెంబర్ 08,(ప్రజాజ్యోతి)**



వినాయక చవితి పండుగ సందర్భంగా మణుగూరు సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పండుగను ప్రశాంతంగా నిర్వహించాలని మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి సూచించారు. మంగళవారం మణుగూరులోని డీఎస్పీ కార్యాలయంలో రాజకీయ,ప్రజా ప్రతినిధులతో శాంతి కమిటీ సమావేశన్ని ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణంలో నియమ నిబంధనలు పాటిస్తూ వేడుకలు జరుపుకోవాలని కోరారు.అంతేగాక పట్టణంలో చవితిని దృష్టిలో పెట్టుకొని పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని నొక్కి చెప్పారు.పట్టణంలో ఎలాంటి వివదాలకు, ఘటనలకు తావులేకుండా చేస్తున్నామని వివరించారు.చవితిని ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలని సూచిస్తూ ఎవరైనా వ్యక్తులు గొడవలు,వివదాలకు,ఘటనలకు పాల్పడితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని శాంతి కమిటీ భేటీలో రాజకీయ, ప్రజా ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు.అలాగే వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరి గా పోలీసుల అనుమతులు తీసుకోవాలని,డీజే సౌండ్ విషయంలో నిబంధనలు అతిక్రమించ వద్దని అధికారులు సూచించారు.ఈకమిటీ సమావేశంలో సీఐ నాగబాబు,పినపాక సీఐ వెంకటేశ్వర్లు,ఎస్ఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం- సర్పంచ్ కుంజా వినోద్

- **జగన్నాధపురం క్లస్టర్‌లో రూ.5.64 కోట్ల రైతు భరోసా**



**ములకలపల్లి, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం జగన్నాధపురం రైతువేదికలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించినట్లు జగన్నాధపురం సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు కుంజా వినోద్ తెలిపారు. జగన్నాథపురం క్లస్టర్ పరిధిలో 2,949 మంది రైతులకు రూ.5,64,08,325 రైతుభరోసా నిధులు అందాయని తెలిపారు. సుమారు 3 వేల మంది రైతులకు రూ.6 కోట్ల మేర రుణమాఫీ జరిగిందన్నారు. రైతుబీమా కింద 16 క్లెయిమ్‌లకు రూ.80 లక్షలు అందించినట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారికి రాబోయే రోజుల్లో ప్రజలే ఓటు రూపంలో సమాధానం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రమేష్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గుంట్రు సాయి, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ జానీ, సురభి రాజేష్, చేకుర్తి రామాచారి, సున్నం నాగేష్, మీడియం నారాయణ, గాదెగోని సతీష్, మరిదు నాగు, కూరం రామకృష్ణ, సున్నం బుచ్చిబాబు, మీడియం వెంగళరావు, రావూరి వెంకటేశ్వరరావు, పెనుబల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తతే రక్షణ.. విద్యార్థినులకు ఎస్సై విజయసింహారెడ్డి సూచనలు

- **కస్తూరిబా పాఠశాలలో మహిళల భద్రత, బాలల రక్షణపై అవగాహన**



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 8, (ప్రజాజ్యోతి):** అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని కస్తూరిబా పాఠశాలలో మంగళవారం అన్నపురెడ్డిపల్లి ఎస్సై విజయసింహారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విద్యార్థినులకు మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ భద్రత, బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం, వేధింపులు, బెదిరింపులు, దుర్వినియోగం, సైబర్ నేరాలు, వెంటాడటం, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు తమ భద్రత విషయంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై విజయసింహారెడ్డి సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో బాలికలకు భద్రతపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని వివరించారు. ఏదైనా ఇబ్బంది, ప్రమాదం లేదా వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. సమస్యలను దాచిపెట్టకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం 112కు ఫోన్ చేయాలని విద్యార్థినులకు వివరించారు. మహిళలు, బాలికలపై వేధింపులు, గొడవలు, ప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా 112కు కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. మహిళలు, బాలికలు, విద్యార్థుల రక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటారని, విద్యార్థినులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విజయసింహారెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తాతా మధు వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం

- ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలి
- పేరం వెంకటేశ్వర్లు
- దళితులను అవమానించే వ్యాఖ్యలు సహించేది లేదు
- కాంగ్రెస్ నాయకులు



**పినపాక,సెప్టెంబర్ 8(ప్రజాజ్యోతి)** దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ పినపాక మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,సర్పంచులు,ఉపసర్పంచులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ..రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువలను అవమానించడమేనని మండిపడ్డారు.తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**పదవిలో కొనసాగేందుకు నైతిక హక్కు లేదు: పేరం**

మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దళితులను బీఆర్ఎస్ పార్టీ చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ పదవులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు.బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న రాజకీయ ఆందోళనలు, విమర్శలపై స్పందిస్తూ.. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరించకుండా వాస్తవాలను ప్రజలకు వివరించాలని సూచించారు.రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

**తాతా మధును అరెస్టు చేయాలి: గొడిశాల రామనాథం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గొడిశాల రామనాథం మాట్లాడుతూ.. దళితుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో దళితులు బీఆర్ఎస్ పార్టీకి తగిన సమాధానం చెబుతారని అన్నారు.

**రాజ్యాంగ పదవుల గౌరవం కాపాడాలి: గంగిరెడ్డి**

జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైనదని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు.

**రాజీనామా చేయకపోతే ఆందోళనలు ఉధృతం: బోడా రమేష్**

జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడా రమేష్ మాట్లాడుతూ.. తాతా మధు వ్యాఖ్యలు ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించేలా ఉన్నాయని ఆరోపించారు. వెంటనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా, మండల స్థాయిలో మరిన్ని ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలి: చిట్టిమల్ల ప్రసాద్**

పినపాక ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిట్టిమల్ల ప్రసాద్ మాట్లాడుతూ.. తాతా మధు చేసిన వ్యాఖ్యలు దళిత సామాజిక వర్గాన్ని కించపరిచే విధం గా ఉన్నాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి, చట్టపరంగా నేరం నిర్ధారణైతే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మట్టి గుట్టలకు మంచు ముస్తాబు

- రెల్లుగడ్డితో సీతారామ ప్రాజెక్టు వద్ద సరికొత్త అందం
- తెల్లటి పూలతో మంచు కొండల్లా
- అశ్వాపురంలో చూపరులను కట్టిపడేస్తున్న ప్రకృతి
- సీతారామ గుట్టలపై వయ్యారి పూల జల్లు
- గాలి సోకితే రెల్లుగడ్డి అందాల విందు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి/అశ్వాపురం (ప్రజాజ్యోతి)**మట్టి గుట్టలు కూడా ముస్తాబైతే ఎలా ఉంటాయో.? భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో సీతారామ ప్రాజెక్టు కోసం తవ్వి పోసిన బోసి మట్టి గుట్టలు ఇప్పుడు తెల్లటి చీర కట్టుకున్నట్లుగా మెరిసేలా అందాలు అరబోస్తున్నాయి. వర్షానికి పుట్టుకొచ్చిన ఈ రెల్లుగడ్డి తెల్లటి పూలతో గుట్టలన్నీ నిండి పోవడంతో అటుగా వచ్చేవారు దూరం నుంచి చూస్తే కాశ్మీర్ లోని మంచు కొండల్లా కనిపిస్తున్నాయి.గాలి వీచిన ప్రతిసారీ ఆ తెల్లటి పూలు అలలా ఊగుతూ వచ్చిపోయే వాహన దారులను ఆగి మరీ చూసేలా దృష్టిని ఆకర్షస్తున్నాయి.ప్రాజెక్టు కోసం ఏర్పడిన గుట్టల కు ప్రకృతి తనంతట తానుగా అద్దిన అందం ప్రతి ఒక్కరిని మైమరపిస్తున్నాయి.దీంతో రెల్లుగడ్డి తెల్లటి పూలు ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్నాయి.

## పాలిటెక్నిక్ ల విలీనాన్ని ఆపాలి

- మణుగూరులో 23వ రోజుకు చేరిన టీపీజేఏసీ ధర్నా
- శక్తిలో విలీనం వద్దే వద్దు..నల్ల బ్యాడ్జీలతో మణుగూరు పాలిటెక్నిక్ ఉద్యోగుల నిరసన



**మణుగూరు క్రైమ్, సెప్టెంబర్ 08,(ప్రజాజ్యోతి)**పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి/ వైఐఎస్యూలో విలీనం చేయవద్దంటూ టీపీజేఏసీ మణుగూరు శాఖ 23వ రోజు ధర్నా కొనసాగించారు. మంగళవారం ప్రభుత్వ ఆదర్శ రెసిడెన్షియల్ పా లిటెక్నిక్ కళాశాల ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహిస్తూ నిరసన తెలిపారు.70 ఏళ్లుగా పాలిటెక్నిక్ వ్యవస్థ పేద, బడుగు,బలహీన వర్గాల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్యను అందిస్తూ 95% ప్రవేశాలతో విజయవంతం గా నడుస్తోందని,ఇది పేదల విద్యా వ్యవస్థ అని వారు పేర్కొన్నారు.పాలిటెక్నిక్ లను శక్తిలో విలీనం చేయవద్దని, కమిటీ త్వరగా సమావేశమై సానుకూల నివేదిక ఇచ్చి విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలని వారు డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ పార్టీ అరాచక పాలనను వ్యతిరేకించండి

- ప్రశ్నిస్తున్నారని అసెంబ్లీకి రాకుండా అడ్డుకున్న ప్రభుత్వం తెల్లం భాస్కర్, గడ్డం వీరన్న, వీరస్వామి



**గుండాల సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అరాచక పాలనను సాగిస్తుందని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తెల్లం భాస్కర్, గడ్డం వీరన్న, మోకాళ్ళ వీరస్వామి లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి అంబేద్కర్ విగ్రహం ముందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యేలను ఎమ్మెల్సీలను అడ్డుకోవడం సరైంది కాదన్నారు. టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ప్రశ్నిస్తున్నారని భయంతోనే అసెంబ్లీకి రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అరాచక పాలనను, కొనసాగిస్తూ ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెడుతూ నీచమైన రాజకీయం చేస్తున్నారన్నారు. అసెంబ్లీ గేటు ముందు నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యేల ఎమ్మెల్సీల పై పోలీసులతో దాడులు చేయించడం సిగ్గుచేటు అన్నారు. మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించిన అనంతరం, అంబేద్కర్ విగ్రహానికి మెమో రండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు టి రాము, వట్టం రవి, గుగ్గల లక్ష్మీనారాయణ, మిట్ట రాములు, గుగ్గల రాంబాబు, తాటి కృష్ణ, సుధాకర్, బొమ్మెర్ల శ్రీను, జాడి ప్రభాకర్, వెంకన్న సతీష్ తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్సీ తాత మధు పై కఠిన చర్యలు తీసుకోవాలి

- దళితులపై బి.ఆర్.ఎస్ పార్టీ ద్వంద వైఖరి బయటపడింది
- కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఖదీర్



**గుండాల సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి** ప్రజాస్వామ్య బద్దంగా మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులు వ్యక్తిగత దూషణలకు ప్రజాస్వామిక వ్యాఖ్యలు చేయడం సరైనది కాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఖదీర్ అన్నారు. మంగళవారం గుండాల మండల కేంద్రంలో ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఊకె బుచ్చయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చట్టసభలలో కూర్చుని ఇలాంటి వారే , అత్యున్నత స్థానంలో ఉన్న స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. దళిత నాయకుడని చులకన భావంతో బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడిన అన్ పార్లమెంటరీ వ్యాఖ్యలు సరైనది కాదని దీన్ని ప్రజాసామిక వాదులు ఖండించాలని కోరారు. ఎమ్మెల్సీ తాతా మధును ఆ పార్టీ నుండి ఎమ్మెల్సీ పదవి నుండి  చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు బొమ్మెర్ల నగేష్ మాట్లాడుతూ ఇది ఒక వ్యక్తిపై చేసిన వ్యాఖ్య కాదని దళిత సమాజాన్ని అవమానించడమేనని, దళిత సమాజంపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం పై తాతా మధును కఠినంగా శిక్షించాలన్నారు,. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచులు ఈసం సంజీవరావు, ఢిల్లీ వసంత రావు, భూక్య మంగమ్మ, మాజీ ఎంపీపీ చాట్ల పద్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుష్పరాజు, బి కోజి, వాంకుడోత్ రమేష్, పాయం గణేష్. భూక్య శ్రీను, కాసిం, వాజిద్, ఇస్రాల్, రాజేష్, చంద్రశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తాత మధు వ్యాఖ్యలపై కాంగ్రెస్ భగ్గుమంది!

- డప్పులతో ర్యాలీ.. వివేకానంద కూడలిలో దిష్టిబొమ్మ దహనం



**అశ్వరావుపేట ప్రజా జ్యోతి సెప్టెంబర్ 8** టీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలపై అశ్వరావుపేట కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డప్పులతో ర్యాలీగా బయలుదేరి పట్టణంలోని వివేకానంద సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ తాత మధు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. తాత మధు చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ శ్రేణుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపించారు. రాజకీయ విమర్శలు హద్దులు దాటకూడదని, బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న నాయకులు మాటలను అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు.ర్యాలీ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. వివేకానంద కూడలిలో దిష్టిబొమ్మ దహనం అనంతరం తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కొనసాగుతున్న డైవర్షన్ పాలిట్రిక్స్



**ఇల్లందు, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి)** రాష్ట్రంలో డైవర్షన్ పాలిట్రిక్స్ కొనసాగుతున్నాయని జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ మోకాళ్ళ నాగ స్రవంతి అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ అధికార కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ప్రజాసమస్యలను గాలికొదిలేశాయని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడకుండా పొలిటికల్ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనసభలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రజా సమస్యలకు పరిష్కారం సాధించాల్సిన ప్రతిపక్ష బీఆర్ఎస్ అసభ్యకర వ్యాఖ్యలతో విద్వేషకర వ్యాఖ్యలతో తెలంగాణ ప్రజలను డైవర్ట్ చేసేందుకు బీఆర్ఎస్ యత్నిస్తుందని ఆరోపించారు. ప్రతిపక్షం అసెంబ్లీ సమావేశాల్లో బాధ్యతగా ప్రవర్తిస్తే ప్రభుత్వ వైఫల్యాలపై ఎక్కడ సమాధాన ఇవ్వాల్సి వస్తుందేమోనని బీఆర్ఎస్ తెరలేపిన డ్రామాను కాంగ్రెస్ రక్తికట్టిస్తుందని ఆరోపించారు. ఎంతో విలువైన సభా సమయాన్ని అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ వృథాచేస్తూ ప్రజాసమస్యలను గాలికొదిలేశాయని ఆరోపించారు. ఇకనైనా డైవర్షన్ పాలిటిక్స్ మానుకోని ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ బాధ్యతగా రాజకీయాలను చేస్తూ డైవర్షన్ పాలిట్రిక్స్ మానుకోవాలని సూచించారు. అధికార, ప్రతిపక్షాల వైఫల్యాలపై ప్రజల తరపున ప్రశ్నించేందుకు ప్రజాసమస్యలపై పోరాటం జరిపేందుకు తెలంగాణలో బాధ్యతగా జనసేన రాజకీయాలను చేస్తుందని స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం




**అశ్వారావు పేట ప్రజా జ్యోతి సెప్టెంబర్ 8** ఆశ్వారావుపేట టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ బీఆర్ఎస్ నాయకులు వివేకానంద కూడలి లో రోడ్డుపై బైఠాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం సరికాదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు కాసాని పద్మ, డాక్టర్ ఉదయ జ్యోతి, వాగ్గేల పూజతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అక్రమ అరెస్టులను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## యాష్ టెండర్ల సమస్యను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు దృష్టికి తీసుకెళ్లిన పొనిశెట్టి



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 8, (ప్రజా జ్యోతి)** కేటీపీఎస్ యాష్ టెండర్ల సమస్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావుని బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కలిసి, వినతి పత్రం అందజేసినట్లు బిజెపి రాష్ట్ర నాయకులు పొనిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీపీఎస్ ,టీజీ జెన్కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాష్ టెండర్ల విధానం వల్ల స్థానిక చిన్న కాంట్రాక్టర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ,యాష్‌టెండర్లను చిన్న చిన్న లాట్లుగా విభజించి, స్థానిక చిన్న కాంట్రాక్టర్లకు కూడా అవకాశం కల్పించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ,స్థానిక చిన్న కాంట్రాక్టర్లకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి, వారితో మాట్లాడి తగిన చర్యలు తీసుకునేలా చూడాలని ప్రతిపత్రంలో కోరినట్లు పొనిశెట్టి తెలిపారు, ఈ కార్యక్రమంలో శాంపురి నాగేంద్ర బాబు, భట్టు మధు, గద్దె అశోక్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌పీ గ్యాస్ అక్రమాలపై అధికారుల మౌనమేల?

- **ప్రజల ప్రాణాలకు ముప్పు ఉన్నా పట్టింపు లేదా?**
- **పర్మిషన్ లేని నిర్వహణపై చర్యలకు వెనుకడుగు ఎందుకు?**




**అశ్వారావుపేట ప్రజా జ్యోతి సెప్టెంబర్ 8:**
పట్టణ నడిబొడ్డున హెచ్‌పీ గ్యాస్‌కు సంబంధించిన అనుమతులులేని కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. గ్యాస్ వంటి అత్యంత ప్రమాదకరమైన వస్తువుల నిర్వహణలో నిబంధనలు, భద్రతా ప్రమాణాలు పాటించాల్సి ఉన్నప్పటికీ..సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఎక్కడన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.ప్రజల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాల్లో గ్యాస్ నిల్వలు, పంపిణీ లేదా ఇతర కార్యకలాపాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయా? అనుమతులు, లైసెన్సులు, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు ఉన్నాయా? అన్న అంశాలపై అధికారులు సమగ్రంగా తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది.

**పర్మిషన్ లేనివి సీజ్ చేయడానికి భయమా?**

అనుమతులు లేవని తేలితే సంబంధిత సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం ఉన్నప్పటికీ.. అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్వహణ నిజమైతే వెంటనే తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సామగ్రిని సీజ్ చేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**అగ్ని ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?**

గ్యాస్‌కు సంబంధించిన కార్యకలాపాల్లో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా భారీ ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంది. జనసంచారం ఉన్న ప్రాంతం లో ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉంటుందో అధికార యంత్రాంగం ఆలోచించాల్సిన అవసరం ఉంది. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే.. ముందస్తుగా తనిఖీలు నిర్వహించి ప్రమాదాలను నివారించడమే అధికారుల బాధ్యత.

**జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలి**

గ్యాస్ కార్యకలాపాలకు సంబంధించిన అనుమతులు, భద్రతా ప్రమాణాలు, నిల్వ సామర్థ్యం, ఫైర్ సేఫ్టీ తదితర అంశాలపై సంబంధిత శాఖలు సం యుక్తంగా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. పర్మిషన్లు లేకుండా కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు నిర్ధారణ అయితే ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## మణుగూరులో ఇసుక రణం

- **లారీలకు అడ్డంగా మహిళలు,సొసైటీతో ఘర్షణ.!**
- **అన్నారం ఇసుక రీచ్ వద్ద ఉద్రిక్తత - ఉపాధి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు**
- **ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామ మహిళలు**
- **తోపులాటతో పోలీస్ స్టేషన్ కు చేరిన వివాదం**





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి/మణుగూరు సెప్టెంబర్ 08,(ప్రజా జ్యోతి)** మణుగూరు అన్నారం ఇసుక రీచ్ వద్ద మంగళవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.తమకు ఉపాధి కల్పించాలంటూ గ్రామానికి చెందిన మహిళలు,గ్రామస్తులు ఒక్కసారిగా ఇసుక లారీలకు అడ్డుగా నిలిచారు.దీంతో రీచ్ వద్ద భారీగా లారీలు నిలిచిపోయి గందరగోళం నెలకొంది.లారీలను అడ్డుకున్న మహిళలను తొలగించేందుకు ఇసుక రీచ్ సొసైటీ సభ్యులు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం ఘర్షణకు దారితీసింది.సొసైటీ సభ్యులు మహిళ ల పట్ల దురుసుగా ప్రవర్తించారని గ్రామస్తులు ఆరోపిస్తుండగా,తమ పనులకు ఆటంకం కలిగిస్తున్నారని సొసైటీ సభ్యులు చెబుతున్నారు.ఇరువురి మధ్య తోపులాట జరగడంతో పరిస్థితి చేయిదాటింది.ఈ ఘటనపై ఇరువర్గాలు మణుగూరు పోలీస్ స్టేషన్ లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు.దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.స్థానికులకు ఉపాధి కల్పించకుండా బయటి వ్యక్తులతో ఇసుక వ్యాపారం చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలి

- **రాజ్యాంగబద్ధమైన అసెంబ్లీ వ్యవస్థలో స్పీకర్ పదవికి అత్యంత గౌరవం ఉంది**
- **ఎమ్మెల్సీ పదవికి తాతా మధు వెంటనే రాజీనామా చేయాలి**

**మణుగూరు, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్నల పిలుపు మేరకు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మణుగూరు మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. మణుగూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, జిల్లా ముఖ్య నాయకులు, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యూత్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ సెంటర్‌కు చేరుకున్నారు. అనంతరం స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన అసెంబ్లీ వ్యవస్థలో స్పీకర్ పదవికి అత్యంత గౌరవం ఉందని, అటువంటి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని అన్నారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని ప్రతి ఒక్కరు కాపాడాలని సూచించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకుని తాతా మధు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ఎమ్మెల్సీ పదవి నుంచి తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని నాయకులు స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ పదవికి తాతా మధు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పీరినాకి నవీన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కురం రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# చర్ల సీహెచ్‌సీలో మౌలిక వసతుల కొరత

- రోజుకు 200–300 ఓపీ
- 30 పడకల ఆస్పత్రిపై పెరుగుతున్న రోగుల భారం
- అంబులెన్స్ లేక రోగుల అవస్థలు
- మధ్యాహ్నం తర్వాత స్పెషలిస్టుల సేవలకు బ్రేక్
- మలేరియా మందుల కొరత







**చర్ల, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి):** మండల ప్రజలకు చర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో మెరుగైన వైద్య సేవలు కొనసాగుతున్నప్పటికీ, రోగుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు లేకపోవడం తీవ్ర సమస్యగా మారింది. ప్రతిరోజూ వందలాది మంది రోగులు వైద్యం కోసం ఆస్పత్రిని ఆశ్రయిస్తుండగా వారికి సరిపడా ఓపీ గదులు, సిబ్బందికి ప్రత్యేక గదులు, అంబులెన్స్ వంటి కీలక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం మండలవాసులను ఆందోళనకు గురిచేస్తోంది.చర్ల సీహెచ్‌సీలో ప్రస్తుతం 10 మంది వైద్యులు ఉన్నారు. వీరిలో ఐదుగురు స్పెషలిస్టు వైద్యులు భద్రాచలం నుంచి కాంట్రాక్టు ప్రాతిపదికన చర్లకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. అయితే మధ్యాహ్నం 2 గంటల తర్వాత స్పెషలిస్టు వైద్యులు తిరిగి భద్రాచలం వెళ్లిపోవడంతో ప్రత్యేక వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. ఆ తర్వాత డ్యూటీ వైద్యులపైనే రోగుల వైద్య సేవల బాధ్యత పడుతోంది. ముఖ్యంగా స్పెషలిస్టు వైద్యం అవసరమైన రోగులకు ఈ పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోంది.

**అంబులెన్స్ లేక అత్యవసర వేళల్లో అవస్థలు:**

సీహెచ్‌సీలో అత్యంత కీలకమైన అంబులెన్స్ సదుపాయం లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో రోగిని ఇతర ఆస్పత్రికి తరలించాల్సిన సమయంలో సమీపంలోని అంబులెన్స్ వచ్చే వరకు ఎదురు చూడాల్సి వస్తోందని కొన్ని సందర్భాల్లో సమీప అంబులెన్స్ అందుబాటులో లేకపోతే ప్రైవేటు వాహనాలు లేదా స్వచ్ఛంద సంస్థల అంబులెన్సులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అత్యవసర పరిస్థితుల్లో సమయం అత్యంత కీలకమైనప్పటికీ అంబులెన్స్ అందుబాటులో లేకపోవడం రోగులు, వారి కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. చర్ల సీహెచ్‌సీకి ప్రత్యేక అంబులెన్స్‌ను వెంటనే కేటాయించాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**మలేరియా మందులకు కొరత:**

ఆసుపత్రిలో ప్రస్తుతం సాధారణంగా అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సాయి వర్ధన్ తెలిపారు. అయితే మలేరియాకు సంబంధించిన మందులు ప్రస్తుతం అందుబాటులో లేవని అన్నారు. చర్ల ఏజెన్సీ ప్రాంతానికి సమీపంలో ఉండటం, వర్షాకాలంలో జ్వరాల ప్రభావం పెరిగే అవకాశం ఉండటంతో మలేరియా మందులను ముందుగానే అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

**రక్త పరీక్షల పరికరాలకు సర్వీసింగ్ అవసరం:**

సీహెచ్‌సీలో రక్త పరీక్షలు నిర్వహించే పరికరాలకు సర్వీసింగ్ అవసరమైందని సూపరింటెండెంట్ తెలిపారు. ముఖ్యంగా ఎల్‌ఎఫ్‌టీ పరీక్షల రిపోర్టుల్లో ఎర్రర్లు వస్తున్నాయని అన్నారు . కీలకమైన వైద్య పరీక్షల్లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పరికరాలకు వెంటనే మరమ్మతులు, సర్వీసింగ్ చేపట్టాల్సిన అవసరం ఉందని రోగులు కోరుతున్నారు.

**డాక్టర్ సాయి వర్ధన్ వివరణ :**

చర్ల సిహెచ్ సి లో వసతుల కొరతపై సూపరిండెంట్ సాయి వర్ధన్ ను వివరణ కోరగా వారు మాట్లాడుతూ చర్ల సీహెచ్‌సీకి ప్రతిరోజూ 200 నుంచి 300 వరకు ఓపీ కేసులు వస్తున్నాయని తెలిపారు. నెలకు సుమారు 20 నుంచి 30 ప్రసవ కేసులు కూడా నమోదవుతున్నాయని చెప్పారు. ఇంత భారీగా రోగులు వస్తున్నప్పటికీ వారికి అనుగుణంగా ప్రత్యేక ఓపీ గదులు లేకపోవడం వైద్యులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని తెలిపారు.రోగుల సంఖ్య పెరగడంతో వైద్యులపై పని ఒత్తిడి కూడా గణనీయంగా పెరుగుతోందన్నారు. ఒకే ప్రాంగణంలో అధిక సంఖ్యలో రోగులను పరీక్షించాల్సి రావడంతో వైద్య సేవల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రోగులకు వైద్య సేవలు అందిస్తున్న నర్సింగ్ సిబ్బందికి కూడా అవసరమైన మౌలిక వసతులు పూర్తిస్థాయిలో లేవని తెలిపారు. సిస్టర్లకు ప్రత్యేక గదులు, రెస్ట్రూమ్ వంటి సదుపాయాలు లేకపోవడం వల్ల వారు కూడా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.నర్సింగ్ సిబ్బంది విషయంలో సి హెచ్ సి లో 14 మంది అవసరముండగా 17 మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అందుబాటులో ఉన్న సిబ్బంది రోగులకు సేవలు అందిస్తున్నప్పటికీ, పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా వసతులు, సిబ్బందికి కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు .ప్రస్తుతం చర్ల సీహెచ్‌సీ 30 పడకల ఆస్పత్రిగా కొనసాగుతోంది అని ఆస్పత్రి పక్కనే నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఆ భవనం పూర్తయితే మరిన్ని వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి అవకాశం ఉంటుందని డాక్టర్ సాయి వర్ధన్ తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.రాత్రి వేళల్లో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని పరిస్థితి విషమంగా ఉన్న రోగులను వెంటనే భద్రాచలం ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నామని తెలిపారు.సీహెచ్‌సీలో రక్త పరీక్షలు నిర్వహించే పరికరాలకు సర్వీసింగ్ అవసరమైందని ముఖ్యంగా ఎల్‌ఎఫ్‌టీ పరీక్షల రిపోర్టుల్లో కొన్నిసార్లు ఎర్రర్లు వస్తున్నాయని అన్నారు. సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళామని సమస్యలు పరిష్కరిస్తే మరింత మెరుగైన వైద్యం మండల వాసులకు అందిస్తామని అన్నారు.చర్ల మండలంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న సీహెచ్‌సీలో రోగుల సంఖ్యకు తగ్గట్టుగా మౌలిక వసతులు, అంబులెన్స్, ప్రత్యేక ఓపీ గదులు, సిబ్బందికి అవసరమైన వసతులు, వైద్య పరీక్షల పరికరాల మరమ్మతులు, అవసరమైన మందుల నిల్వ వంటి అంశాలపై ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించాలని మండలవాసులు కోరుతున్నారు.

## భద్రాచలంలో వరుస బైక్ చోరీలకు చెక్

- నలుగురి బైకులతో దొరికిన గుగులోత్ శ్రీను
- కూనవరం రోడ్డులో తనిఖీల్లో పట్టుబడ్డ నిందితుడు
- నాలుగు బైకులు స్వాధీనం,నిందితుడు రిమాండ్
- వివరాలు వెల్లడించిన భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. /భద్రాచలం సెప్టెంబర్ 08,(ప్రజాజ్యోతి)**భద్రాచలం పట్టణంలో గత కొంతకాలంగా వరుసగా జరుగుతున్న మోటార్ సైకిల్ దొంగతనాలకు పోలీసులు మంగళవారం చెక్ పెట్టారు.పట్టణంలో బైక్ చోరీలపై వరుస ఫిర్యాదులు రావడంతో కేసులు నమోదు చేసిన పోలీసులు నిఘా పెంచారు.డీఎస్పీ ఎం.అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు టౌన్ ఎస్ఐ బి. రామకృష్ణ సిబ్బందితో కలిసి మంగళవారం కూనవరం రోడ్డులో వాహనాల తనిఖీలు చేపట్టారు.తనిఖీల్లో భాగంగా మోటార్ సైకిల్ పై వెళ్తున్న గుగులోత్ శ్రీను,సారపాకకు చెందిన వ్యక్తిని ఆపి బైక్ పత్రాలు చెక్ చేశారు. సరైన పత్రాలు చూపించకపోవడంతో అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది.భద్రాచలం,దుమ్ముగూడెం ప్రాంతాల్లో గత కొంతకాలంగా మోటార్ సైకిళ్లు దొంగతనం చేస్తున్నట్లు నిందితుడు పోలీసులతో అంగీకరించాడు. అతని వద్ద నుండి నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.నిందితుడిపై గతంలో కూడా పలు దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్పీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ మోటార్ సైకిల్ దొంగతనాల నివారణకు ప్రత్యేక నిఘా,వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని,ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయవద్దని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని,వీలైనంత వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## ప్రభుత్వ భూముల కబ్జాలపై రిలే దీక్షలు



**చర్ల, సెప్టెంబర్ 08(ప్రజాజ్యోతి):** చర్ల మండలంలోని ప్రభుత్వ భూములు వలసవాదుల కబ్జాల్లో ఉన్నాయని, ఏజెన్సీ ప్రాంతంలో రెవెన్యూ వ్యవస్థలోని లోపాయికారీ వ్యవహారాల కారణంగా ఆదివాసులకు తీవ్ర నష్టం జరుగుతోందని జీఎస్పీ కన్వీనర్ సోందే వీరయ్య ఆరోపించారు. మంగళవారం చర్ల మండలం కొయ్యూరు గ్రామంలో నిర్వహించిన గ్రామసభ సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వ భూముల కబ్జాలను వెంటనే గుర్తించి, వాటిని తేల్చేందుకు రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివాసుల హక్కులకు రక్షణ కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆదివాసుల హక్కుల సాధన కోసం జీఎస్పీ ఆధ్వర్యంలో అక్టోబర్ 5వ తేదీ నుంచి ఐటీడీఏ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టనున్నట్లు ప్రకటించారు.ఈ రిలే దీక్షల్లో సి.కొత్తూరు, కొయ్యూరు గ్రామాలకు చెందిన ఆదివాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సోందే వీరయ్య పిలుపునిచ్చారు. ప్రభుత్వ భూములపై ఉన్న కబ్జాలను తొలగించి, అర్హులైన ఆదివాసులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సున్నం సుబ్బయ్య, దుబ్బరాజు, లక్ష్మి, కల్లూరు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## తాతా మధు వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసన



**చర్ల, సెప్టెంబర్ 08(ప్రజాజ్యోతి):** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ చర్ల మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలపై, ప్రజాప్రతినిధులపై విమర్శలు చేయడానికి అవకాశం ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని అన్నారు . ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచ్ లు , వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

- టీజీఈజేఏసీ పిలుపు



**చర్ల, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న నిర్వహించనున్న “చలో హైదరాబాద్” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి (టీ–జీఈజేఏసీ) పిలుపునిచ్చింది.చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. నరేందర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో టీ–జీఈజేఏసీకి చెందిన వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఇతర వర్గాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ఇప్పటివరకు స్పష్టమైన హామీ రాకపోవడంతో, టీ–జీఈజేఏసీ ఇచ్చిన “చలో హైదరాబాద్” పిలుపును యథావిధిగా కొనసాగించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి బాధ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పెద్ద సంఖ్యలో సమీకరించి హైదరాబాద్‌కు తరలించాలని కోరారు.హక్కుల సాధన కోసం ఉద్యోగ వర్గాలన్నీ ఐక్యంగా కదిలి, ఈ నెల 10న నిర్వహించే “చలో హైదరాబాద్” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీ–జీఈజేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. లక్ష మందితో హైదరాబాద్‌ను కదిలించేలా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరింది.

## నాగరాజు కుటుంబానికి ఆర్థిక సాయం



**చర్ల, సెప్టెంబర్ 08(ప్రజా జ్యోతి) :** చర్ల మండలం విజయ కాలనీకి చెందిన టాటా మ్యాజిక్ యూనియన్ సభ్యుడు డబ్బుల నాగరాజు అకాల మృతితో ఆయన కుటుంబం విషాదంలో మునిగిపోయింది. తమ యూనియన్ సభ్యుడు నాగరాజు మృతి యూనియన్‌తో పాటు ఆయన కుటుంబానికి తీరని లోటని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.నాగరాజు కుటుంబాన్ని ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో చర్ల శ్రీ సమ్మక్క సారలమ్మ టాటా మ్యాజిక్ యూనియన్ సభ్యులు ముందుకు వచ్చారు.మంగళవారం యూనియన్ తరఫున నాగరాజు కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మిడియం కృష్ణ మాట్లాడుతూ తమ సభ్యుడు నాగరాజుకు కనీసం ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా లేకపోవడం బాధాకరమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా యూనియన్‌లోని ప్రతి సభ్యుడికి లేబర్ ఇన్సూరెన్స్ చే యించి, వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం లో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కోగిల బుచ్చన్న, అంజిబాబు, పూజారి నాగార్జున, వెంకట్, పఠాన్ ఆరిఫ్, లంగరి వంశీ తదితరులు పాల్గొన్నారు.

## తాతా మధు అరెస్టును ఖండిస్తున్నాం

- **మండల బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు, కో-కన్వీనర్ ఐనవోలు పవన్**




**చర్ల, సెప్టెంబర్ 08(ప్రజా జ్యోతి):** ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ తాతా మధును అక్రమంగా అరెస్టు చేయడాన్ని చర్ల మండల బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు, కో-కన్వీనర్ ఐనవోలు పవన్ తీవ్రంగా ఖండించారు. ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ ప్రజల తరపున ఉద్యమాలు చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఓర్వలేక అణచివేత చర్యలకు పాల్పడుతోందని వారు ఆరోపించారు.అసెంబ్లీలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకోవడం, కొట్టడం, కిందపడేసి తొక్కడం, మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా వ్యవహరించడం, మెడలు పట్టుకుని బయటకు లాగడం వంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ఇలాంటి ఘటనలు తెలంగాణ చరిత్రలో ఎన్నడూ జరగలేదన్నారు.ఈ ఘటనలపై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను పట్టుకుని అసలు ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. స్పీకర్‌కు తన వ్యాఖ్యలు బాధ కలిగించినట్లయితే వాటిని వెనక్కి తీసుకుంటున్నానని తాతా మధు ఇప్పటికే బహిరంగంగా ప్రకటించినప్పటికీ ఆయనను అరెస్టు చేయడం అన్యాయమన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వారు విమర్శించారు. ప్రజాప్రతినిధులైన మహిళా ఎమ్మెల్యేలకే రక్షణ లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అసెంబ్లీలో జరిగిన అవమానం తెలంగాణ మహిళలందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నామని అన్నారు .అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి మహిళలకు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్సీ తాతా మధుపై పెట్టిన కేసులను ఉపసంహరించుకుని వెంటనే విడుదల చేయాలని దొడ్డి తాతారావు, ఐనవోలు పవన్ డిమాండ్ చేశారు.

# రెండవ రోజు విమానాశ్రయానికి ప్రతిపాదిత స్థలాల పరిశీలన చేసిన ఏ ఏ ఐ మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం

- **తిమ్మంపేటలో పరిశీలనను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి)**

గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కు చెందిన సాంకేతిక నిపుణుల బృందం రెండు రోజులుగా జిల్లాలోని ప్రతిపాదిత ప్రాంతాలను పరిశీలిస్తూ, విమానాశ్రయ ఏర్పాటుకు అనుకూలతపై వివిధ సాంకేతిక అంశాలను అధ్యయనం చేస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం ములకలపల్లి మం డలం తిమ్మంపేటలో జరుగుతున్న సాంకేతిక పరిశీలనను ఏ ఏ ఐ బృంద సభ్యులతో కలసి జిల్లా కలెక్టర్ అంకిత్ పర్యవేక్షించారు. జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి సుజాతానగర్ మండలంలోని సీతంపేట, సుజాతానగర్, దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని పాల్వంచ/దమ్మపేట, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను ప్రతిపాదిత స్థలాలుగా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన భౌగోళిక, భౌతిక, సాంకేతిక ప్రమాణాలను పరిశీలించేందుకు ఏఏఐ సాంకేతిక బృం దం అధ్యయనం చేశారు,ఏఏఐ సభ్యు లు భరత్ రెడ్డి, ఎం.డి. ఏవియేషన్ నేతృత్వంలోని సాంకేతిక బృందం ప్ర తిపాదిత ప్రాంతాల్లో భూమి స్వభా వం, ఎత్తుపల్లాలు, కొండలు, కొండచరియలు, అటవీ ప్రాంతాలు, నీటి ప్రవాహ మార్గాలు, రహదారులు, రైల్వే మార్గాలు, విద్యుత్ లైన్లు తదితర అంశాలను పరిశీలించారు, విమానాశ్రయానికి అత్యంత కీలకమైన రన్‌వే ఏర్పాటుకు అవసరమైన ప్రాంతం, విమానాల రాకపోకలకు సంబంధించిన అప్రోచ్ ప్రాంతం, పరిసరాల్లో ఉన్న అడ్డంకులు తదితర అంశాలపై కూడా సాంకేతికంగా అంచనా వేసింది.గతంలో ప్రతిపాదించిన ప్రాంతాలకు సంబంధించి మ్యాప్‌ల ఆధారంగా సుమారు 500 ఎకరాల విస్తీర్ణాన్ని పరిశీలించినప్పటికీ, విమానాశ్రయానికి అవసరమైన రన్‌వే, అప్రోచ్, ఇతర అనుబంధ సౌకర్యాల దృష్ట్యా అదనపు ప్రాంతాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని సాంకేతిక బృందం తెలిపింది. ముఖ్యంగా అప్రోచ్ ప్రాంతానికి సుమారు 1.5 కిలోమీటర్ల వరకు అదనపు స్థలం అవసరమయ్యే అవకాశాలను కూడా బృందం పరిశీలిస్తోంది అని తెలిపారు.కొన్ని ప్రతిపాదిత ప్రాంతాల్లో రైల్వే మార్గం సమీపంలో ఉండటాన్ని కూడా సాంకేతిక బృందం పరిశీలించింది. సత్తుపల్లి గూడ్స్ రైల్వే లైన్ ప్రతిపాదిత ప్రాంతానికి సుమారు 100 నుంచి 120 మీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాల్లో రన్‌వే దిశ, విమానాల అప్రోచ్‌కు దాని ప్రభావం తదితర అంశాలను అధ్యయనం చేస్తున్నారు. అదేవిధంగాదుమ్ముగూడెం ప్రాంతంలో కూడా సాంకేతిక బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించింది. ప్రధాన రహదారి నుంచి ప్రతిపాదిత ప్రాంతానికి వెళ్లే మార్గం ప్రస్తుతం ఇరుకుగా, కొన్ని చోట్ల మట్టి రహదారిగా ఉండటం, పరిసరాల్లో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండటం వంటి అంశాలను గుర్తించింది. అదే సమయంలో భూమి ప్రొఫైల్ అనుకూలంగా ఉండటం, విమానాశ్రయానికి పెద్దగా అడ్డంకులు కనిపించకపోవడం వంటి సానుకూల అంశాలను కూడా పరిశీలించింది. భవిష్యత్‌లో రహదారి, వంతెనల అభివృద్ధితో కనెక్టివిటీ మెరుగుపడే అవకాశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు .ప్రతిపాదిత ప్రాంతాల్లో ఉన్న చిన్న కొండలు, మట్టి మడులు, ఎత్తైన ప్రాంతాలు, అటవీ ప్రాంతాలు విమానాశ్రయ నిర్మాణానికి ఏ మేరకు ప్రభావం చూపుతాయనే అంశాన్ని కూడా బృందం పరిశీలిస్తోంది.కొన్ని ప్రాంతాల్లో సుమారు 10 నుంచి 15 మీటర్ల ఎత్తు కలిగిన చిన్న కొండలు ఉన్నట్లు గుర్తించి, వాటిని తొలగించడం లేదా భూమిని సమతలీకరించడం సాంకేతికంగా సాధ్యమా అనే అంశాన్ని పరిశీలించనుంది. అదేవిధంగా ఉన్న మట్టి మడులు/ఓవర్‌బర్డెన్ ప్రాంతాల తొలగింపు సాధ్యాసాధ్యాలను కూడా అధ్యయనం చేయనుంది.విమానాశ్రయానికి ప్రతిపాదిత ప్రాంతాల్లో నీటి ప్రవాహ మార్గాలు, వాగులు, కాలువలు ఉండటం కూడా కీలకమైన అంశంగా సాంకేతిక బృందం పేర్కొంది. రన్‌వే కింద నీటి ప్రవాహ మార్గాలు ఉండటం వల్ల ఎదురయ్యే సాంకేతిక సమస్యలు, డ్రైనేజీ ఏర్పాట్లు, భూమి ఆకృతి ఆధారంగా రన్‌వే దిశను మార్చే అవకాశం ఉందా అనే అంశాలను కాంటూర్ మ్యాప్‌లు, టోపోగ్రాఫికల్ డేటా ఆధారంగా పరిశీలించనున్నారు, అటవీ ప్రాంతంగా నమోదైన భూములు, ఓపెన్ ఫారెస్ట్ ప్రాంతాలు, పర్యావరణ పరమైన అనుమతులు, చెట్ల తొలగింపు తదితర అంశాలపై సంబంధిత శాఖల నుంచి అవసరమైన వివరాలు, అనుమతుల పరిస్థితిని కూడా పరిశీలించనున్నారు విమానాశ్రయ స్థల ఎంపికలో కేవలం భూమి విస్తీర్ణం మాత్రమే కాకుండా భూమి ఎత్తుపల్లాలు, రన్‌వే దిశ, విమానాల అప్రోచ్ మార్గం, పరిసర కొండలు, అటవీ ప్రాంతాలు, నీటి ప్రవాహ మార్గాలు, రైల్వే–రహదారి మార్గాలు, విద్యుత్ లైన్లు, గాలి వేగం–దిశ, వర్షపాతం, భూసాంకేతిక పరిస్థితులు వంటి అనేక అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని ఏఏఐ సాంకేతిక బృందం స్పష్టం చేసింది.ప్రతిపాదిత స్థలాలపై క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను కాంటూర్ మ్యాప్‌లు, టోపోగ్రాఫికల్ మ్యాప్‌లు, గత 10 నుంచి 40 సంవత్సరాల వర్షపాతం వివరాలు, గాలి వేగం–దిశకు సంబంధించిన డేటా తదితర సమాచారంతో అనుసంధానం చేసి సాఫ్ట్‌వేర్ ఆధారిత విశ్లేషణ, సిమ్యులేషన్ నిర్వహించనున్నట్లు సాంకేతిక బృందం తెలిపింది. విమానాశ్రయ కార్యకలాపాలు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ , కమ్యూనికేషన్ వ్యవస్థలు, సివిల్ ఇంజినీరింగ్ అంశాలను వేర్వేరుగా పరిశీలించి సమగ్ర సాంకేతిక సాధ్యాసాధ్యాలను అంచనా వేయనున్నారు.ఈ సందర్భంగా ఏఏఐ సభ్యులు, సాంకేతిక బృందం చేపట్టిన క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించిన అంశాలను జిల్లా కలెక్టర్ అంకిత్‌కు వివరించారు. ప్రతిపాదిత ప్రాంతాలకు సంబంధించిన రెవెన్యూ, సర్వే, అటవీ, రహదారులు, రైల్వే, భౌగోళిక, వాతావరణ తదితర వివరాలను సాంకేతిక బృందానికి అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.విమానాశ్రయ స్థల ఎంపికకు సంబంధించి పూర్తిస్థాయి సాంకేతిక అధ్యయనం, డేటా విశ్లేషణ, సిమ్యులేషన్ తదితర ప్రక్రియలకు సుమారు 6 నుంచి 8 వారాల సమయం పట్టే అవకాశం ఉందని సాంకేతిక బృందం తెలిపింది. అనంతరం సమగ్ర సాంకేతిక సాధ్యాసాధ్యాల నివేదికను రూపొందించనుంది.ప్రస్తుతం జరుగుతున్న క్షేత్రస్థాయి పరిశీలన ప్రాథమిక సాంకేతిక అధ్యయనంలో భాగమేనని, ఏ ప్రతిపాదిత ప్రాంతాన్ని తుది విమానాశ్రయ స్థలంగా ఎంపిక చేసినట్లు ఇప్పటివరకు నిర్ణయం తీసుకోలేదని అధికారులు స్పష్టం చేశారు. ఏఏఐ సాంకేతిక సాధ్యాసాధ్యాల నివేదిక, సంబంధిత శాఖల అనుమతులు, భౌగోళిక–పర్యావరణ అంశాలు, భవిష్యత్ కనెక్టివిటీ తదితర అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం మాత్రమే తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో కొత్తగూడెం ఆర్డీవో మధు, సిపిఓ సునీత, ములకలపల్లి తాసిల్దార్ స్వాతి బిందు, ఆర్అండ్ బి నాగేశ్వరరావు, సర్వే అధికారు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండించిన కాంగ్రెస్

- **తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్**



**ఆళ్ళపల్లి, సెప్టెంబర్8(ప్రజాజ్యోతి)** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్, సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య తీవ్రంగా ఖండించారు. మంగళవారం మండలంలోని మర్కోడు గ్రామంలో తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ శ్రేణులు తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వాసం శ్రీకాంత్ మాట్లాడుతూ..ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ స్పీకర్ పదవికి అత్యంత గౌరవం, హోదా ఉంటుందని అన్నారు. అలాంటి రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్ కుమార్‌పై వ్యక్తిగతంగా అవమానకర వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉంటాయని, పదవిలో ఉన్న వ్యక్తిని కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని పేర్కొన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు వాసం శ్రీకాంత్.ఎక్స్ ఎంపీపీ పడిగా సమ్మయ్య. సర్పంచ్ సుతారీ రమాదేవి.ఉపసర్పంచ్ పగలబోయిన సతీష్.ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇందు కుమార్. కార్యదర్శి కీసరి లాల్ బాబు.యూత్ అధ్యక్షుడు వాసం శ్రీకాంత్. మండల నాయకులు ఎస్కే పర్వీన్. కేక్కర్ల సునీత.సుతారి కృష్ణ. గ్రామ అధ్యక్షులుకోనేటి వీరభద్ర చారి.ఉపాధ్యక్షులు కొలగాని శ్రీ కాంత్. ఊల్లోజు భరత్. ఈశ్వరోజువెంకటేశ్వర్లు. కొమరం రామనాథం. ముప్పారపు రాము. చీమల శేఖర్. అనుగోజువీర చారి. కొమరం వెంకట్ సాయి. సంతు. మల్లేష్.నాగార్జున.చంద్రం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అప్రకటిత కరెంటు కోతలతో అల్లాడుతున్న ప్రజలు

- ఎప్పుడు కరెంటు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి —
- సాయంత్రం వేళల్లో గంటకుపైగా కోతలతో తీవ్ర ఇబ్బందులు



**అశ్వాపురం, సెప్టెంబర్ 8,ప్రజాజ్యోతి** అశ్వాపురం మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల మధ్య విద్యుత్ కోతలు విధించడంతో ఇళ్లలో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంటకు పైగా విద్యుత్ సరఫరా నిలిచి పోతుండటంతో గృహ అవసరాలతో పాటు వ్యాపార కార్యకలాపాలు కూడా దెబ్బతింటున్నాయని స్థానికులు వాపోతున్నారు. విద్యుత్ కోతలపై అధికారులను అడిగితే స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటే ముందుగానే ప్రజలకు తెలియజేయాలని కోరుతున్నారు.

**దినదిన గండంగా మారిన విద్యుత్ కోతలు**

విద్యుత్ కోతలకు నిర్దిష్ట సమయం లేకపోవడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా తరచూ విద్యుత్ నిలిచిపోవడంతో సాధారణ జీవనం స్తంభిస్తోంది. వర్షాకాలంలో విద్యుత్ అంతరాయాలు మరింత పెరగడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

**అధికారులు స్పందించాలని డిమాండ్**

అప్రకటిత విద్యుత్ కోతలకు శాశ్వత పరిష్కారం చూపాలని, సరఫరా నిలిపివేసే పరిస్థితుల్లో ముందస్తు సమాచారం ఇవ్వాలని మండల ప్రజలు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి వార్డు సభలు

- మూక మామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి




**ములకలపల్లి, సెప్టెంబర్ 8:** గ్రామంలోని ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి వార్డు సభలకు శ్రీకారం చుట్టారు. వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్ (వీజీపీ)లో భాగంగా ప్రతి వార్డులో పర్యటించి ప్రజలతో సమావేశమయ్యారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, పింఛన్లు, ఇళ్ల సమస్యలపై వినతులు స్వీకరించి రిజిస్టర్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. "గ్రామసభకు ప్రజలు వస్తారు.. వార్డు సభల ద్వారా మేమే ప్రజల వద్దకు వెళ్తున్నాం. ప్రజల సమస్యలు వారి వీధుల్లోనే తెలుసుకుంటేనే పరిష్కారం సాధ్యమవుతుంది. వచ్చిన ప్రతి సమస్యను రాబోయే మూడేళ్ల వీజీపీ ప్రణాళికలో చేర్చి పరిష్కరిస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దోమల అరుణ్‌కుమార్, టీఏ తాటి సత్యం, వార్డు మెంబర్లు కణితి చిన్న వెంకటేశ్వర్లు, కిసరి రాజ్ కుమార్, తానం పావని,కోర్సా శ్రీకృష్ణ, బచ్చల చైతన్య కుమారి, కీసరి గోపాలరావు, కీసరి రామజోగి, గడ్డం రాజబాబు గ్రామ పెద్దలు కీసరి గోపయ్య, బాబురావు, గడ్డం బాబు, సవలం సత్యనారాయణ, ఎస్.కె అబ్దుల్లా, పున్నం వెంకన్న గ్రామస్తులు పాల్గొన్నారు..

## సమస్య చెప్పండి.. పరిష్కరిస్తా : సర్పంచ్ కుంజా వినోద్

- 6వ వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్న సర్పంచ్



**ములకలపల్లి, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):** మండలంలోని జగన్నాథపురం గ్రామ సర్పంచ్ కుంజా వినోద్ 6వ వార్డులో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో సీసీ రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరగా.. త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. అప్పటి వరకు రోడ్లపై ఏర్పడిన గోతులను గ్రావెల్ తో పూడ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు సర్పంచ్ దృష్టికి తీసుకురాగా, కోతుల నివారణకు బోనును త్వరలో వార్డుకు పంపిస్తామని చెప్పారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని స్థానికులను కోరారు. వర్షాకాలంలో జ్వరాలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు సభ్యురాలు కొవ్వాకుల మంగా, అయ్యగారి చేకుర్తి రామాచారి, బొల్లిపల్లి సురేష్, కత్తి జంపన్న, బొమ్మకంటి రామ్, లక్ష్మణ్, వీరస్వామి, బెజవాడ సావిత్రి, కత్తి ఏసు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ శ్రేణుల భారీ నిరసన

- తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పర్స వెంకట్ డిమాండ్




**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 8, (ప్రజా జ్యోతి):** తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ అన్నపురెడ్డిపల్లి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం భారీ ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పర్స వెంకట్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తాతా మధు వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమంజసం కాదని నాయకులు పేర్కొన్నారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పర్స వెంకట్ మాట్లాడుతూ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధమైన పదవులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ సాగుపై అవగాహన




**ములకలపల్లి, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని బింగి చిలకమ్మ వ్యవసాయ క్షేత్రంలోని వేరుశనగ పంటలో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేవీకే కొత్తగూడెం శాస్త్రవేత్త భరత్ రైతులకు నేల తయారీ, విత్తన ఎంపిక, కలుపు నియంత్రణపై అవగాహన కల్పించారు. విత్తనాలను రైజోబియంతో శుద్ధి చేసి విత్తుకోవాలని, పూత దశలో ఎకరాకు 200 కిలోల జిప్సం వేయాలని సూచించారు. పొలంబడి కార్యక్రమంలో రైతులు పరస్పరం చర్చించుకోవడం వల్ల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులే శిక్షకులుగా మారడంతో రైతుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అశ్వారావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రైతులు వేరుశనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. త్వరలో ఐకేపీ ఆధ్వర్యంలో ములకలపల్లిలో వేరుశనగ నూనె తయారీ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి అరుణ్ బాబు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు సూరిబాబు, సుజాత, రైతులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఆశా వర్కర్లను బేషరతుగా విడుదల చేయాలి..
- సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు డిమాండ్




**ములకలపల్లి సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):** ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ ధనలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ధర్నాకు వెళ్లకుండా ఆశా వర్కర్లను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ములకలపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా నిమ్మల మధు మాట్లాడుతూ.. అరెస్టు చేసిన ఆశా వర్కర్లను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కురం నాగలక్ష్మి, రోషమ్మ, కళ్యాణి, సంధ్య, శ్యామల, శాంతి, పార్వతి, జ్యోతి, లవకుమారి తదితరులు పాల్గొన్నారు

## పాల్వంచలో వ్యక్తిపై దాడి

- ముగ్గురిపై కేసు నమోదు

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 8 ,(ప్రజా జ్యోతి )** పాల్వంచలో ఒక వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ముగ్గురు పై పాల్వంచ పోలీస్ స్టేషన్లో బుధవారం కేసు నమోదు అయింది, ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి,పాల్వంచ పట్టణంలోని స్థానిక రాంనగర్‌లో గల కనకదుర్గ బార్ షాప్ వద్ద మంగళవారం రాత్రి రెండు గంటల సమయంలో టీచర్స్ కాలనీకి చెందిన మణుపూరి ప్రభాకర్ అనే వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసినట్లు పట్టణ పోలీస్ స్టేషన్లో ప్రభాకర్ ఫిర్యాదు చేశారు, ప్రభాకర్ తన స్నేహితుడైన విసంపల్లి మధును కలిసేందుకు కనకదుర్గ బార్ షాప్‌కు వెళ్లి, అనంతరం ఇంటికి వెళ్లేందుకు బార్ షాప్ ముందు నిలబడి ఉండగా, అంబేద్కర్ సెంటర్ వైపు నుండి ముగ్గురు వ్యక్తులు వచ్చి తనను దుర్భాషలాడుతూ విచక్షణారహితంగా దాడి చేసినట్లు ఫిర్యాదును పేర్కొన్నారు , ఈ దాడిలో తన ఎడమవైపు తలకు తీవ్ర గాయం అయినట్లు తెలిపారు. ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనపై దాడికి పాల్పడిన కొత్తగూడెం కు చెందిన వినయ్, బాబు క్యాంపుకు చెందిన శివ, పాల్వంచ జయమ్మ కాలనీకి చెందిన ఘని లపై పాల్వంచ ఎస్ హెచ్ ఓ నాగరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు,

# భూ రీ సర్వేను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

- ఎస్ఐఆర్‌లో నోటీసుల జారీ పత్రాల అప్‌లోడ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్





**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 8,(ప్రజా జ్యోతి)** భూ రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐ డి ఓ సి లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి తహసీల్దార్లు, సర్వే, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మండలాల వారీగా రీ సర్వే పురోగతిని సమీక్షించారు. రీ సర్వేలో గ్రామసభను మొదటి దశగా నిర్వహించి రైతులకు సర్వే విధానం, తేదీలు, భూ హద్దుల నిర్ధారణ తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామసభలు పూర్తయిన వెంటనే గ్రామ సరిహద్దుల నిర్ణయం, హద్దుల గుర్తింపు, క్షేత్రస్థాయి సర్వే వంటి తదుపరి ప్రక్రియలను ప్రారంభించాలని ఆదేశించారు.మండలాల వారీగా కొన్ని గ్రామాల్లో గ్రామ సరిహద్దుల నిర్ణయం, హద్దుల స్థిరీకరణ, సర్వే పనులు కొనసాగుతున్నట్లు, మరికొన్ని గ్రామాల్లో గ్రామసభలు పూర్తయి తదుపరి ప్రక్రియకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు వివరించారు. పెండింగ్‌లో ఉన్న గ్రామాల్లో వెంటనే గ్రామసభలు నిర్వహించి సర్వే ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు, జీపీఓలు, వీఆర్ఓలను సమర్థవంతంగా వినియోగించి రోజువారీ లక్ష్యాలతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన అనంతరం రైతులకు ఖచ్చితమైన హద్దులు, కోఆర్డినేట్లతో కూడిన భూ మ్యాప్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సీతారామ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి ఎక్కడైనా సమస్యలు లేదా అభ్యంతరాలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి పరిష్కరించాలని, అవసరమైన శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు.జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో నోటీసుల జారీ, హియరింగ్స్ , సంబంధిత పత్రాల ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. హియరింగ్ నిర్వహించడంతో పాటు సంబంధిత పత్రాలను కూడా వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో జిల్లాలో రాష్ట్రస్థాయి పురోగతి 62 శాతంగా ఉండగా, భద్రాచలం 57.51 శాతం, పినపాక 51 శాతం పురోగతి నమోదైనట్లు సమీక్షలో వెల్లడైంది. గుండాల, పాల్వంచ, పినపాక, అశ్వాపురం, అల్లపల్లి, చంద్రుగొండ, దమ్మపేట, కరకగూడెం తదితర మండలాల్లో నోటీసుల జారీ, హియరింగ్స్ పురోగతిని పరిశీలించారు. ఇప్పటికే నోటీసులు జారీ చేసిన కేసుల్లో హియరింగ్స్ నిర్వహించి, సంబంధిత పత్రాలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.రాబోయే రెండు మూడు రోజుల్లో నోటీసుల జారీ, హియరింగ్స్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## బూర్గంపాడు మార్కెట్ వద్ద భారీగా గంజాయి పట్టివేత

- రూ.9.33 లక్షల విలువైన 18.6 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



**బూర్గంపహాడ్, సెప్టెంబరు 8 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ వ్యవసాయ మార్కెట్ వద్ద పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి 18.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.9.33 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గంపహాడ్ వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఎస్ఐ నాగబిక్షం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో టీవీఎస్ ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న రెండు బ్యాగులను పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు.దీంతో గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయితో పాటు అక్రమ రవాణాకు ఉపయోగించిన ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లను సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అరెస్టయిన వారిని కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరు జిల్లాకు చెందిన నవీన్‌కుమార్ (27), విజయ్‌కుమార్ (33)గా పోలీసులు గుర్తించారు. నిందితులు తుమకూరు నుంచి ఒడిశాకు వెళ్లి అక్కడ గంజాయిని కొనుగోలు చేసిన అనంతరం తిరిగి కర్ణాటకకు వెళ్తుండగా బూర్గంపాడు వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారని తెలిపారు.ఈ ఘటనపై ఎస్ఐ నాగబిక్షం ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో వారిని జైలుకు తరలించారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ శ్రేణుల భారీ నిరసన

- తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పర్స వెంకట్ డిమాండ్

**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 8, (ప్రజా జ్యోతి ):** తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ అన్నపురెడ్డిపల్లి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం భారీ ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పర్స వెంకట్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తాతా మధు వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమంజసం కాదని నాయకులు పేర్కొన్నారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పర్స వెంకట్ మాట్లాడుతూ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధమైన పదవులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా నేతకు జన ఆశీర్వాదం..!

- ఎమ్మెల్యే కోరం జన్మదిన వేడుకలు
- కేక్ ను కట్ చేసి రక్తదాన శిబిరం ఏర్పాటు
- పేదలకు దుస్తుల పంపిణీ, అన్నదానం నిర్వహణ
- జన్మదిన శుభాకాంక్షల వెల్లువ





**ఇల్లందు, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి ):** ఇల్లందు ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ కోరం కనకయ్య జన్మదిన వేడుకలను మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఇల్లందు పాత బస్టాండ్ లోని అయిత ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్యే అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పేదలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా దుస్తులను పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా బుల్లితెర ప్రముఖ కళాకారులు, జబర్దస్త్ ఫేమ్ వినోద్, నవీన్, రాజు టీమ్ లతో పలువురిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ శ్రేణులు అత్యవసర సమయంలో రక్తం అందక ఇబ్బందులు పడుతున్న వారికి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారుల్లోకి వచ్చిన వెయ్యి రోజుల్లోనే పేదలకు రెండు లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నూతన రేషన్ కార్డులు, పెన్షన్లను మంజూరు చేయడం జరిగిందని, రైతులకు ఒకేసారి రెండు లక్షల రుణమాఫీతో పాటు రైతు భీమా, రైతు భరోసా పథకాలను అమలుచేసి వారికి అండగా ఉన్నామని స్పష్టం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో లక్ష రూపాయల రుణమాఫీని కూడా రెండు విడుదలుగా 50వేల చొప్పున ఇచ్చి రైతులను మోసం చేశారని విమర్శించారు. ఇటీవల అసెంబ్లీ గేటు వద్ద దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నారని పేర్కొన్నారు. స్పీకర్ ను ఉద్దేశించి ఎవడ్రా స్పీకర్ అంటూ ఏకవచనంతో సంబోధించడం సరైన పద్ధతి కాదని, స్పీకర్ పదవి ఏ ఒక్క పార్టీకి చెందినది కాదని, అది శాసనసభ గౌరవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీక అని తెలిపారు. దళిత బిడ్డ స్పీకర్ స్థానంలో ఉండడాన్ని జీర్ణించుకోలేకనే బిఆర్ఎస్ నేతలు కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని, స్పీకర్ను అవమానించడం అంటే యావత్తు దళిత సమాజాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాల్సి ఉండగా అసెంబ్లీ ముందు బట్టలు విప్పి డ్రామాలు చేయడం సరికాదని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, ఆనాడు పార్లమెంటులో పోన్నం ప్రభాకర్, ఉత్తంకుమార్ రెడ్డి లాంటి నాయకులు తెలంగాణ కోసం గట్టిగా పోరాడాలని గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త గడపగడపకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోళ్ళ సూర్యం, మండల రాము, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, మున్సిపల్ కౌన్సిలర్, సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే అభిమానులు పాల్గొన్నారు.

